క్లుప్తంగా

తైక్వాండో టోర్నీకి ఎంపిక



విద్యార్థి రఘును అభినందిస్తున్న కళాశాల వైస్ చైర్మన్లు, ప్రిన్సిపాల్

కడప ఎడ్యుకేషన్ : కడప బాలాజీనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థి టి.రఘు జేఎన్‌టీయూ తరపున తైక్వాండో టోర్నీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.వీరసుదర్శన్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ నెలలో పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో జరగనున్న అఖిలభారత అంతర విశ్వవిద్యాలయ తైక్వాండో టోర్నీకి జేఎన్‌టీయూ తరపున రఘు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్లు ప్రకాష్ అంబవరం, ప్రదీప్ అంబవరం, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వీర సుదర్శన్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి వల్లి భాష, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్, కళాశాల సిబ్బంది రఘుని అభినందించారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని యూత్ సండే సందర్భంగా క్రైస్ట్, ఎస్‌పీజీ యూత్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. సోమవారం సన్‌రైజ్ ఆస్పత్రి, పార్థ డెంటల్ ఆస్పత్రి, సుధాకర్ ఈఎన్‌టీ ఆస్పత్రి, బ్రైట్ విజన్ కేర్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 200 మంది ఉచిత వైద్య సేవలను పొందారు. 30 మంది యువతీ యువకులు రక్తదానం చేశారు. గవర్నమెంటు జనరల్ ఆస్పత్రి వారిచే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంఘ కాపరి రెవరెండ్ పాదర్ శాంతి స్వరూప్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎస్‌పీజీ యూత్ ఫెలోషిప్ అసిస్టెంట్ సెక్రటరీ గిఫ్టీ మాట్లాడుతూ శిబిరం ప్రాధాన్యతను తెలియజేశారు.

సుభాష్ చంద్రబోస్ ఆశయాలు సాధిద్దాం

కడప ఎడ్యుకేషన్ : దేశ స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు సాధిద్దామని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సుభాష్‌చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌండేషన్ 81వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం కడప కాగితలపెంట ఏఐఎస్‌బీ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఏర్పాటు చేసి నేతాజీ సర్కిల్ అని నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మతుల్లా, చరణ్, పయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని ప్రజలు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ మునాఫ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రైల్వేస్టేషన్‌లోని పోస్టల్ మెయిల్ కార్యాలయంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది జీవీ కుమార్, సురేంద్రారెడ్డి, రమేష్ నాయక్, చంద్రమోహన్, రహీమ్, శరత్, సాయి, మందాకిని పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం ఎర్రముక్కపల్లి సర్కిల్‌లోని కందిపాలెంలో నంద్యాల కృష్ణ (62) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని కడప వన్‌టౌన్ ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కృష్ణ బేల్దారు పని చేస్తుండేవాడని, జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. గత కొంతకాలంగా తల్లి వద్ద ఉంటున్నారని, తల్లి మరణించడంతో తన అనారోగ్య పరిస్థితుల కారణంగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

25,26లలో అంధుల పాఠశాల వజ్రోత్సవ వేడుకలు

కడప ఎడ్యుకేషన్ : కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేసి 75 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఈ నెల 25, 26 తేదీలలో పాఠశాలలో వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు వి.ఎబినేజర్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ప్రముఖులు హాజరు అవుతారని పేర్కొన్నారు. కావున పాఠశాల పూర్వపు విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతలు, శ్రేయోభిలాషులు, పూర్వపు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొనాలని కోరారు.

ఏపీఎంఐపీ పీడీ నియామకం

కడప అగ్రికల్చర్: ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ వైఎస్సార్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎం. వెంకటేశ్వర్‌రెడ్డిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఉత్తర్వులను జారీ చేశారు. ఎం. వెంకటేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారిగా పని చేస్తున్నారు. ఈయనను డిప్యూటేషన్ బేసిస్‌పై వైఎస్సార్ జిల్లాకు ఏపీఎంఐపీ పీడీగా నియమించారు. ఈ మేరకు ఆయన నేడో, రేపో బాధ్యతలను స్వీకరించనున్నారు.

పర్యావరణ శ్రీమంతులు

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు మొక్కల దత్తత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఊరికి ఉపకారం చేయాలన్న సంకల్పంతో తీసిన తెలుగు సినిమా చిత్రం 'శ్రీమంతుడు'ని ఆదర్శంగా తీసుకుని విద్యాబుద్ధులు చెబుతున్న విద్యాసంస్థకు, సమాజానికి మేలు చేయాలని సంకల్పించిన విద్యార్థినులు మొక్కలు నాటడం, వాటిని దత్తత తీసుకుని సంరక్షించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పర్యావరణ శ్రీమంతులుగా, ఆదర్శంగా నిలుస్తున్నారు.

- మొక్కలు దత్తత తీసుకున్న విద్యార్థినులు
- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో దత్తత కార్యక్రమానికి శ్రీకారం



విద్యార్థినులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు కో కరికులర్, ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్‌కు చక్కటి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా కళాశాలకు వచ్చే ఏడాది న్యాక్ అసెస్‌మెంట్‌కు వెళ్లనున్న నేపథ్యంలో.. ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీంబాషా మదిలో మెదిలిన ఓ చిన్న ఆలోచన విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలిచింది. విద్యాలయాన్ని హరిత విద్యాలయంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం వృక్షశాస్త్ర విభాగం అధ్యాపకులకు తెలియజేశారు. దీంతో వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సుబ్రమణ్యం యోగివేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్‌కు వెళ్లి అక్కడి ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఆచార్య ఎ. మధుసూధన్‌రెడ్డి సహకారంతో ఎర్రచందనం, సైకస్ తదితర మొక్కలను తీసుకువచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతోపాటు.. ఈ యేడాది నుంచి ప్రారంభమైన సింగిల్ మేజర్ విధానంలో బీఎస్సీ ప్రథమ సంవత్సరం బోటనీ చదువుతున్న విద్యార్థులకు మొక్కలు నాటడం, సంరక్షణ బాధ్యత అప్పజెప్పారు. అమ్మ పేరుతో మొక్క నాటడంతోపాటు వాటిని దత్తత తీసుకుని వాటి బాధ్యతను విద్యార్థినులు తీసుకునేలా వారిలో స్ఫూర్తినింపారు. దీంతో విద్యార్థినులు విద్యాలయంలో మొక్కలు నాటడంతోపాటు తామంతా మరో మూడు సంవత్సరాల పాటు ఇదే కళాశాలలో చదువుకుంటామని, అప్పటి వరకు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకుంటామని పేర్కొన్నారు.

కాలుష్య నివారణకు మార్గం



పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన బాధ్యత ఉంది. ప్రతి ఒక్కరూ ముఖ్యమైన రోజుల్లో మొక్కలు నాటే ప్రయత్నం చేయాలి. మేము సైతం మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకుంటున్నాం.

- వి.కీర్తి, వృక్షశాస్త్ర విద్యార్థిని, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప

సంరక్షణ బాధ్యత తీసుకున్నాం



మొక్కల ప్రాధాన్యత అందరికీ తెలిసినా సమాజంలో ఆశించిన మేర చెట్లు నాటడం లేదు. ఒకవేళ నాటినా.. వాటి సంరక్షణ మరిచిపోతున్నాం. ఈ క్రమంలో మొక్కలు నాటడంతో ఆపేయకుండా వాటిని బాధ్యత, సంరక్షించుకునేలా మొక్కలను దత్తత తీసుకుని రక్షిస్తాం.

- ఎం.దివ్య, వృక్షశాస్త్ర విద్యార్థిని, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప

చక్కటి కార్యక్రమంలో భాగస్వాములయ్యాం



మొక్కల దత్తత కార్యక్రమానికి ప్రిన్సిపాల్ పిలుపునివ్వడంతో వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులం అందరం భాగస్వాములయ్యాం. మొక్కల పరిరక్షణ ఆవశ్యకతను తోటి విద్యార్థులకు వివరించి విద్యాలయాన్ని హరితమయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.

- ఎస్.కరిష్మా, వృక్షశాస్త్ర విద్యార్థిని, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప

నగర సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- కమిషనర్ మనోజ్‌రెడ్డి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : నగరంలోని సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించరాదని నగర పాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 23 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగం–10, టౌన్‌ప్లానింగ్–0, రెవెన్యూ–3, హెల్త్–1, యూపీఏ విభాగం–1 అర్జీలు వచ్చాయి. అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, ఎంహెచ్ఓ చంద్రశేఖర్, ఈఈలు ధనలక్ష్మి, నారాయణస్వామి, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు. అర్జీల్లో కొన్నింటి వివరాలు ఇలా ఉన్నాయి.

■ సింగపూర్ టౌన్‌షిప్‌లో సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర అధ్యక్షుడు వెంకటశివ, పి.మల్లికార్జున వినతి పత్రం సమర్పించారు. సింగపూర్ టౌన్‌షిప్‌లో పార్కు స్థలం, ఓపెన్ స్పేస్‌కు కేటాయించిన స్థలంలో కార్పొరేషన్‌కు సంబంధం లేకుండా ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణం చేపడుతుండటం దారుణమన్నారు. వెంటనే ఆ పనులను నిలుపుదల చేసి, స్థానికంగా చేసుకున్న అగ్రిమెంట్లను రద్దు చేయాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

■ వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సెక్రటరీలను బదిలీ చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని కార్పొరేటర్లు మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, సి.స్వప్న, బి.గంగాదేవి, వి.హేమలత, శ్రీలేఖ కోరారు. సచివాలయ సిబ్బందిపై ఏవైనా ఫిర్యాదు వస్తే బదిలీ చేయాలి తప్ప, ఏ కారణం లేకుండా చేయడం తగదన్నారు. ఈ బదిలీలకు జనరల్ బాడీ, స్టాండింగ్ కమిటీ అనుమతి కూడా లేదన్నారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్ మాత్రమే చేయాలని కోరారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి

విద్యుత్ నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. అప్సర సర్కిల్ వద్ద అపోలో మెడికల్ షాప్ పక్కన వీధిలో రోడ్డు నిర్మాణం చేయాలన్నారు. కొండాయపల్లెలో చెత్త పాయింట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. గురుకుల్ విద్యాపీఠ్ వద్ద వర్షపునీరు నిల్వ ఉండకుండా కల్వర్టు ఏర్పాటు చేసి డ్రైనేజీ కాలువకు మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ నారాయణస్వామి, డీఈ కిరణ్, ఏఈ స్వరూప పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు వినతి

కడప సెవెన్‌రోడ్స్ : మహాదాత బుడ్డా వెంగళరెడ్డి, ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహాలను ప్రభుత్వ ఖర్చుతో కడప నగరంలో ఏర్పాటు చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎన్.రవిశంకర్‌రెడ్డి, ఏపీ రెడ్డి సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఏపీ దళిత మిత్ర వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు సోమవారం మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డికి విన్నవించారు. బుడ్డా వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. భావి తరాలకు స్ఫూర్తినిచ్చేందుకు వీరిరువురి విగ్రహాలు కడప నగరంలోని ఐటీఐ సర్కిల్, రైతు బజారు లేదా రాజీవ్‌మార్గ్‌లో ఏర్పాటు చేయాలని కోరారు.

స్థలాల పరిశీలన

ఇందుకు కమిషనర్ మనోజ్‌రెడ్డి స్పందిస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులను పంపి స్థలాలను పరిశీలిస్తామన్నారు. అధికారుల నివేదిక ఆధారంగా అనువైన ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : సమాచారం హక్కు చట్టం –2005పై మండల, గ్రామస్థాయి అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం కడపలోని వ్యవసాయ కార్యాలయంలో సమాచారహక్కు చట్టంపై మండల, గ్రామస్థాయి అధికారులతోపాటు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారం హక్కుచట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండటంతోపాటు వివిధ సెక్షన్ల గురించి తెలుసుకుని ఉండాలన్నారు. సెక్షన్ 6,7(1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో పూర్తిస్థాయి సమాచారాన్ని ఇవ్వాలి ఉందని తెలిపారు. సెక్షన్ 4(1)(సి) ప్రకారం కార్యాలయ ఆవరణంలో సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో పౌర సమాచార అధికారి పేరు, హోదా, మొబైల్ నెంబర్ స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని తెలిపారు. దీంతోపాటు పలు సెక్షన్ల గురించి వివరించారు. ప్రజలు కూడా సమాచారచట్టంపై అవగాహన పెంచుకుని అవసరమైన సమాచారాన్ని ప్రభుత్వ అధికారులు, సంస్థల నుంచి పొందగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఎండీ షఫీ, దాసరి శివప్రసాద్

కడప కార్పొరేషన్ : బద్వేలులో విద్యార్థిని దస్తగిరమ్మపై పెట్రోల్ పోసి కాల్చిన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శివప్రసాద్, 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దస్తగిరిమ్మ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో చిత్తూరు జిల్లా పుంగనూరు, వైఎస్సార్ జిల్లా బద్వేలు, ఉమ్మడి అనంతపురం జిల్లా హిందూపురం, తిరుపతి, పిఠాపురం.. ఇలా అనేక ప్రాంతాలలో మహిళల పట్ల జరుగుతున్న దారుణాలు బాధాకరంగా ఉన్నాయన్నారు. మహిళల రక్షణకు, భద్రత కోసం రూపొందించిన దిశ యాప్‌ను తీసి వేయడం సరైంది కాదన్నారు. దిశ యాప్ ఉంటే వీరిలో చాలా మంది రక్షించబడేవారన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న బాదుల్లా

కడప రూరల్ : బద్వేలుకు చెందిన విద్యార్థిని దస్తగిరమ్మ మృతికి కారణమైన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను బహిరంగంగా శిక్షించాలని హ్యూమన్ రైట్స్ షా సోషల్ జస్టిస్ చైర్మన్ మహమ్మద్‌షా, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుంకేసుల బాదుల్లా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద బాధితురాలి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల పొలం ఇవ్వాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ ఇబ్రహీం, లీగల్ సెల్ సెక్రటరీ అమీన్‌పీరా, రాష్ట్ర నాయకులు పడిగాల పెద్దన్న, ఇండ్లూరి సురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

మానవతా వాదాన్ని 'కవి'త్వీకరించిన విద్వాన్ విశ్వం



విద్వాన్ విశ్వం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ రచయితల సంఘం ప్రతినిధులు

కడప కల్చరల్ : ప్రముఖ కవి విద్వాన్ విశ్వం మానవతా వాదానికి కవిత్వ రూపం ఇచ్చి తన భావాలను పాఠకుల్లోని సులభంగా చొచ్చుకుపోయేటట్లు చేశారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో సంఘం ఆధ్వర్యంలో విద్వాన్ విశ్వం 110వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్వాన్ విశ్వం రాసిన ఇతరరచనలు, వాటి ప్రత్యేకతల గురించి గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రచయిత అయిన బాల యల్లారెడ్డి, కళాకారులు ఏవీఎస్ రాజు, బాల ఓబయ్య పాల్గొన్నారు.

■ అర్జీ లేఖరుల కష్టాలు



జిల్లా కేంద్రమైన కడప కలెక్టరేట్‌కు సోమవారం వచ్చిందంటే చాలు జిల్లా నలమూలల నుంచి ప్రజలు తమ సమస్యలను చేతులలో కాగితాలు చేత బట్టుకొని వస్తుంటారు. తెలిసిన వారు అర్జీలు రాసుకొని నేరుగా కలెక్టర్‌కు ఇవ్వడం జరుగుతుంది.. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే మహిళలు, వృద్ధులు వారికి అవగాహన లేకపోవడంతో కలెక్టరేట్ ఎదుట అర్జీ లేఖరుల కష్టాలు అంతా ఇంతా కాదు. మండు ఎండలో కష్టాలు అంతా ఇంతా కాదు. ప్రజల కష్టాలను లేఖ రూపంలో అర్జీలను తయారు చేసి అర్జీదారులకు ఇవ్వడంతో వారు ఆ లేఖలను కలెక్టర్‌కు సమర్పించడం జరుగుతుంది. గత 15, 16 సంవత్సరాలుగా ఇలా రోడ్డుపై, ఫుట్‌పాత్ పై తమ కష్టాలను ఎవరికి చెప్పుకోలేక ఇలా రోడ్డుపైనే అర్జీలను రాస్తున్న దృశ్యాలు సాక్షిగా కెమెరా బంధించింది. కావున తమ కష్టాలను గుర్తించి, కలెక్టర్ కలెక్టరేట్ ఆవరణంలో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయవలసిందిగా కోరుచున్నారు.

– మహమ్మద్ రఫీ, ఫొటోగ్రాఫర్, సాక్షి

సంక్షేమ పథకాలు అమలు చేయాలని ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో చేదోడు, తోడు, వాహన మిత్ర పథకాలను తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. గతంలో కొద్దిమందికే సంక్షేమపథకాలు అందాయన్నారు. కూటమి ప్రభుత్వం చేతి వృత్తుల కుటుంబాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎంతో ఆశించామన్నారు. కానీ ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలు తిరిగి ప్రవేశ పెట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు జేవీ రమణ, సంగటి మనోహర్, వైఎం ప్రతాప్‌రెడ్డి, కైపు రామాంజనేయులు, పెద్దుళ్లపల్లె మల్లికార్జున, జేసీపీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు గున్నా జయరాములు, వై.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

నేడు అష్ఫాకుల్లా ఖాన్ జయంతి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ దేశ ఐక్యత కోసం, తెల్ల దొరలను ఈ దేశం నుంచి తరిమేయడమే మన లక్ష్యం అని పిలుపునిచ్చిన అష్ఫాకుల్లా ఖాన్ 124వ జయంతిని జయప్రదం చేయాలని ఆఫ్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా తెలిపారు. సోమవారం నగరంలోని ఆఫ్ కీ ఆవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని కొంత మంది మతం పిచ్చి ఎక్కిన మతోన్మాదులు ఈ దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని, ఇలాంటి త్యాగమూర్తుల త్యాగాలు తెలియకుండానే మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశ ఐక్యత కోసం తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి అతి చిన్న వయసులోనే ఉరిస్తంభం ఎక్కిన విప్లవ వేగుచుక్క అష్ఫాకుల్లా ఖాన్ అని అన్నారు. 1900 అక్టోబర్ 22వ తేదీన అష్ఫాకుల్లా ఖాన్ ఉత్తర ప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో నివాసమున్న షఫీకుర్ రెహమాన్ – మజ్హరున్నీసా దంపతులకు జన్మించాడని అన్నారు. అతి చిన్న వయసులోనే విప్లవ బాటలో నడిచి ఈ దేశంలో ఉన్న తెల్లదొరలను తరిమేయడం కోసం దేశ ప్రజలను ఈ పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫ్ కీ ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు చాన్ భాష, నగర కార్యదర్శి ఆబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

కాశీలో సామూహిక పిండ ప్రదానం



కాశీలో పిండ ప్రదానం చేస్తున్న కాశీ విశ్వనాథ సేవా సమితి సభ్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప శ్రీ కాశీ విశ్వనాథ సేవా సమితి ఆధ్వర్యంలో వారణాసిలో సోమవారం సామూహికంగా పిండ ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనాథలుగా మృతి చెందిన 375 మందికి ఇప్పటి వరకు అంత్యక్రియలు నిర్వహించారు. వారి ఆత్మలు శాంతించాలని పవిత్ర పుణ్యక్షేత్రమైన వారణాసి (కాశీ)లో పిండ ప్రదాన కార్యక్రమాన్ని వారి కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించారు. ఈ సామూహిక పిండ ప్రదానంలో శ్రీ కాశీ విశ్వనాథ సేవా సమితి సేవా మూర్తులైన ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, రిటైర్డ్ ఆర్టీసీ డిపో మేనేజర్ నాగుల రాంప్రసాద్, పుట్టా పురుషోత్తం, వెంకటసురేష్‌బాబు, టైలర్‌రవి, ఎలక్ట్రీషియన్ మధు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

వైవీయూ : మొక్కల పెంపకం అందరి బాధ్యతని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో వృక్షశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో మొక్కలు నాటి హరిత విద్యాలయంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సుబ్రమణ్యం, డా. రాజ మోహన్‌రెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

అనాథ, బాలికల వసతి గృహాల పరిశీలన



వసతి గృహంలోని వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ పలు అనాథ, బాలికల వసతి గృహాలను సోమవారం పరిశీలించారు. జిల్లాలోని నందిమండలం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, చింతకొమ్మదిన్నె మండలం ప్రకాశంపల్లెలో గల ఆశా నిలయం ప్రత్యేక స్కూల్, చెన్నూరు మండలం ఉప్పరపల్లిలో గల మెర్సీ హోం కరుణాలయం, వల్లూరులోని కృప వృద్ధాశ్రమం, చెన్నూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని ఆయన పరిశీలించారు. ఆయా వసతి గృహాల్లోని వంటశాల, వసతి గదులు, డైనింగ్ హాలు, స్టోర్ రూము, పరిసరాలను పరిశీలన చేశారు. అనంతరం తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, కడప వసతి గృహాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో మహిళలకు ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న ఎయిర్‌ఫోర్స్ అధికారి సువేందర్‌సింగ్

వైవీయూ : ఇండియన్ ఎయిర్‌ఫోర్సులో మహిళలకు పురుషులతో సమానంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎయిర్‌ఫోర్సు అధికారులు సువేందర్‌సింగ్, సందీప్‌లు సూచించారు. సోమవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్టెప్, నెహ్రూ యువకేంద్ర, ఎన్ఎస్ఎస్, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఎయిర్‌ఫోర్సులో ఉద్యోగ అవకాశాలు' అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వి.సలీంబాషా, నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మణికంఠ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.గురివిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ డా. జి.విజయలక్ష్మిదేవి, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా.ఎం. గురుమోహన్‌రెడ్డి స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ వాయిదా

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు వాయిదా పడ్డాయి. నగర పరిధిలోని 100 సచివాలయాల్లో పని చేస్తున్న సచివాలయ సెక్రటరీలను ఒకేసారి బదిలీ చేయాలన్న కొందరు అధికారుల నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తాయి. బీఎల్ఓ విధులు నిర్వహిస్తున్న వారిని జనవరి 6 వరకూ బదిలీలు చేయరాదని ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు ఉన్నాయి. అలాగే ఏ బదిలీల్లో అయినా 20 శాతం మందికి మించి బదిలీ చేయరాదన్న నిబంధన కూడా ఉంది. ఈ బదిలీల వ్యవహారంపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. అలాగే 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున ఆధ్వర్యంలో కార్పొరేటర్లు సోమవారం ఈ బదిలీలకు జనరల్ బాడీ లేదా స్టాండింగ్ కౌన్సిల్ అనుమతి లేదని, మొత్తం అందరినీ బదిలీ చేసే అధికారం నగరపాలక అధికారులకు లేదని వినతి పత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో ఈనెల 22, 23 తేదీల్లో జరగాల్సిన బదిలీల కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

విద్యార్థి దశ నుంచే సమాజ సేవ

వైవీయూ : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రవేశం పొందడం ద్వారా విద్యార్థిదశ నుంచే సమాజసేవ చేసే అవకాశం లభిస్తుందని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ త్రితీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపు లీడర్ (ఎల్‌టీసీ) రమణయ్య పేర్కొన్నారు. కడప నగరం శంకరాపురంలో నిర్వహిస్తున్న త్రితీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో భాగంగా సోమవారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ జిల్లా నుంచి ఎందరో విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా రాజ్యపురస్కార్, రాష్ట్రపతి పురస్కారం పొందారన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి డి. ప్రమీల మాట్లాడుతూ క్యాంపులో రోజువారి నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కమిషనర్ లక్ష్మీకర్, జిల్లా సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా, ఓబన్న పాల్గొన్నారు.